సభ్యత్వ నమోదులో మల్కాజిగిరి ముందంజ



సభ్యత్వ నమోదు వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న ఎంపీ ఈటల

మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్

కుషాయిగూడ: బీజేపీ సభ్యత్వ నమోదులో రాష్ట్రంలోనే మల్కాజిగిరి పార్లమెంట్ మొదటి స్థానంలో ఉందని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. మల్లాపూర్‌లోని ఎస్‌ఎల్‌ఎస్‌ఎస్ ఫంక్షన్ హాల్‌లో శనివారం జరిగిన బీజేపీ మేడ్చల్–మల్కాజిగిరి అర్బన్‌జిల్లా సభ్యత్వాలపై నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి పది లక్షల ఓట్లు వస్తే ఐదు లక్షల సభ్యత్వాలు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఇందులో ఇప్పటికే మూడు లక్షల సభ్యత్వాలు పూర్తిచేసి రాష్ట్రంలోనే ప్రథమస్థానంలో ఉందన్నారు. ఇదే స్ఫూర్తితో ఈనెల 10వ తేదీలోపు మిగతా సభ్యత్వాలను పూర్తిచేసేందుకు కార్యాచరణ చేపట్టామన్నారు. ఈ మేరకు మూడు జిల్లాల పార్టీ అధ్యక్షులతో సమావేశం నిర్వహించామని పేర్కొన్నారు. గత ఐదు నెలలుగా హైడ్రాతో ఇబ్బందులు పడుతున్న మూసీ పరివాహక ప్రాంతాల ప్రజలకు అండగా నిలిచామన్నారు. స్థానిక సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందించి పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కలిసికట్టుగా ముందుకెళ్లాలన్నారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కాటిపల్లి జనార్దన్ రెడ్డి, బీజేపీ జిల్లా మహిళ అధ్యక్షురాలు డాక్టర్ శిల్పారెడ్డి స్థానికనేతలు పాల్గొన్నారు.

ఘనంగా సదర్ వేడుకలు



సదర్ వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు

ఉప్పల్: ఉప్పల్‌హిల్స్ సదర్ వేడుకల్లో ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. యాదవ సోదరులు ప్రతి ఏటా నిర్వహించుకునే సదరన్ ఉత్సవాలు నగరానికే తల మానికంగా నిలుస్తాయన్నారు. దున్నలతో నిర్వహించిన పలు విన్యాసాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. శివ, శ్రీనివాస్‌రెడ్డి, రాజుయాదవ్, రాంచందర్, సుధాకర్ రెడ్డి, మల్లేష్, సతీష్‌యాదవ్, రాజు, రవి, శెట్టి తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో..

మల్కాజిగిరి: మల్కాజిగిరిలో శ్రీకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సదర్ వేడుకలు ఘనంగా జరిగాయి. వేడుకల్లో దున్నపోతుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి సదర్ వేడుకలకు హాజరయ్యారు. సంఘం తరుపున మండల్ రాధాకృష్ణయాదవ్ వారిని సన్మానించారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ పరిధిలో శనివారం సదర్ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. పలు ప్రాంతాల్లో బీఆర్ఎస్ నేతలు సదర్ ఉత్సవాల్లో పాల్గొన్నారు.



ఉత్సవాల్లో పాల్గొన్న మందుముల పరమేశ్వర్‌రెడ్డి



గౌతంనగర్‌లో..

కార్తీకమాస ప్రత్యేక పూజలు

మల్కాజిగిరి: కార్తీకమాసం సందర్భంగా మల్కాజిగిరి, ఈస్ట్ ఆనంద్‌బాగ్‌లోని పలు శివాలయాల్లో పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. నెల రోజుల పాటు జరిగే పూజా కార్యక్రమాల్లో భాగంగా తొలిరోజు శివలింగాలకు సామూహిక అభిషేకం , అర్చనాది పూజలు చేశారు. మహిళలు దీపాలు వెలిగించారు.

కార్తీక దీపోత్సవం..

రామంతాపూర్: గోఖలేనగర్‌లోని శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం రాత్రి ధ్వజ స్తంభ కార్తీక దీపోత్సవాన్ని వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య ఘనంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ కక్కినేని హరీష్‌తో పాటు పలువురు భక్తులు పాల్గొన్నారు.



గీతానగర్ శారదా చంద్రమౌళీశ్వరస్వామి

గౌతంనగర్: కార్తీకమాసం సందర్భంగా గౌతంనగర్ డివిజన్ ఉత్తమ్‌నగర్ దుర్గా జ్యోతిష్యాలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

విజయ వినాయక ఆలయంలో..

గౌతంనగర్ డివిజన్ విజయ వినాయక ఆలయంలో మాజీ ఎమ్మెల్యే ఆకుల రాజేందర్ అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ





లబ్ధిదారులకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి

మౌలాలి: వినాయక్‌నగర్ డివిజన్‌కు చెందిన ఐదు మంది సీఎం రిలీఫ్‌ఫండ్ కోసం దరఖాస్తు చేసుకోగా వారి వైద్య ఖర్చుల నిమిత్తం పద్మకు రూ.15,500, శ్రీనివాస్‌కు రూ.60 వేలు, హిమబిందుకు రూ. రూ.42 వేలు, రత్న మాణిక్యంకు రూ.32,500, మాధవన్‌కు రూ.60 వేల చెక్కులను శనివారం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి లబ్ధిదారులకు అందజేశారు. డివిజన్ అధ్యక్షుడు తులసి సురేష్, డివిజన్ కార్యదర్శి బాలకృష్ణగుప్తా తదితరులు పాల్గొన్నారు.

అల్వాల్: వెంకటాపురం డివిజన్ శివనగర్‌కు చెందిన విజయమ్మకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.48 వేల చెక్కును శనివారం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. నాయకులు అనిల్‌కిషోర్‌గౌడ్, మోసిన్, విజయ్, నాగేందర్ తదితరులున్నారు.

గురుకుల డైట్ చార్జీల పెంపుపై హర్షం

మేడిపల్లి: మేడిపల్లిలోని మహాత్మా జ్యోతిరావుపూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల బాలుర బీసీ పాఠశాలలో శనివారం ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు డైట్‌చార్జీలు పెంచినందుకు రాష్ట్ర ప్రభుత్వం, కృషిచేసిన అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం విద్యార్థులు పాఠశాలలో కేక్ కట్‌చేసి హర్షం వ్యక్తం చేశారు.అనంతరం ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర గురుకుల విద్యాలయాల్లో విద్యను అభ్యసిస్తున్న పేద, మధ్యతరగతి విద్యార్థులకు మంచి భోజనవసతి, సౌకర్యాలను కల్పించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చాలా గొప్పదన్నారు. నిరుపేద, ప్రతిభ గల విద్యార్థులకు పౌష్టికాహారం అందిస్తే వారు భవిష్యత్తులో చదువుల్లో ఉన్నతంగా రాణించి లక్ష్యాలను చేరుతారన్నారు. పేద విద్యార్థుల బంగారు భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం డైట్ చార్జీలను పెంచినందుకు హర్షం వ్యక్తం చేశారు.



కేక్ కటింగ్‌లో మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల విద్యార్థులు

కార్తీకం... శివోహం

దేవాలయాల్లో ప్రారంభమైన కార్తీకమాస పూజలు

> దీపావళి అమావాస్య తర్వాత నుంచి మొదలయ్యే కార్తీకమాసం శివ కేశవులకు ఎంతో ఇష్టమైన మాసంగా పరిగణిస్తారు. ఈ మాసంలో సూర్య భగవానుడు తులా రాశిలో ఉంటాడని కార్తీకమాసంలో వేకువజామున లేచి చేసే స్నానాలు దీపారాధనలు ఉపవాస దీక్షలు విశేష ఫలితాలు, ఆరోగ్యం, ఐశ్వర్యం సిద్ధించే విధంగా శుభాలు జరుగుతాయని వేద పండితులు చెబుతున్నారు.
> – రామంతాపూర్



కోదండ రామలింగేశ్వర ఆలయ గోపురం

సూర్యోదయానికి ముందు సూర్యుడు అస్తమించిన అనంతరం ఇళ్లలో తులసి కోట వద్ద ఆలయాల్లో ధ్వజ స్తంభాల వద్ద దీపారాధన చేస్తే ఆ పరమ శివుడికి ప్రీతికరమని పురోహితులు వివరిస్తున్నారు. ఈ నేపథ్యంలో శనివారం రామంతాపూర్ పరిధిలోని శివాలయాల్లో కార్తీకమాస పూజలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా రామంతాపూర్‌లోని శివాలయాల వివరాలు వాటి ప్రాధాన్యత గురించి వివరంగా..

మల్లికార్జునస్వామి దేవాలయం

పాత రామంతాపూర్‌లో కొలువుదీరిన మల్లికార్జునస్వామి ఆలయం భక్తులకు బంగారంగా మారింది. ఈ ఆలయంలో కొలువైన ముక్కంటికి కార్తీకమాసంలో అభిషేకాలు నిర్వహిస్తే కోరిక కోర్కెలు నెరవేతాయని భక్తులకు నమ్మకం. ఈ ఆలయంలో నిజాం నవాబులు పాలిస్తున్న కాలంలో ఈ ప్రాంత జాగీర్దార్ భార్య రహమద్బి ద్వారా శివలింగం జాడ తెలిసినట్లు ప్రతీతి. సిద్దులు శిల్పి ద్వారా ఈ ఆలయాన్ని నిర్మించినట్లు ఆలయ పురాణం చెబుతుంది.

కోదండ రామలింగేశ్వర ఆలయం

1987లో రామంతాపూర్ శ్రీనివాసపురంలో ఈ ప్రాంత భూస్వామి కంది పాపిరెడ్డి చిన్న స్థలంలో స్థానిక భక్తులంతా కలిసి కోదండ రామలింగేశ్వర ఆలయాన్ని నిర్మించారు. కార్తీకమాసంలో నెలరోజుల పాటు ఈ దేవాలయాల్లో స్వామివారికి అభిషేకాలు, అర్చనలు, రుద్రాభిషేకాలు, పంచామృత అభిషేకాలు నిర్వహిస్తారు.

శివాలయం

రామంతాపూర్ ఇందిరానగర్ శ్రీ రమాసహిత సత్యనారాయణ స్వామి ఆలయ ప్రాంగణంలో నిర్మించిన శివాలయానికి కార్తీకమాసంలో వందలాది మంది భక్తులు ముక్కంటిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేస్తారు.

మార్కండేయ స్వామి దేవాలయం

చిన్న చెరువును ఆనుకుని ఉన్న భక్త మార్కండేయ ఆలయాన్ని 1883లో స్థానిక పద్మశాలి సంక్షేమ సంఘం విశాల ప్రాంగణంలో నిర్మించారు. ఈ దేవాలయంలో శివలింగాన్ని ఆలింగనం చేసుకుని ఉన్న శ్రీ మార్కండేయ స్వామి విగ్రహం భక్తులను భక్తి పారవశ్యంలో ముంచెత్తుతుంది. కార్తీకమాసంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, దీపారాధన కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. ఆలయాల్లో వేకువ జామున వందలాది మంది మహిళాభక్తులు శివుడికి అభిషేకాలు, ఆలయ ప్రాంగణంలో దీపారాధనలు చేస్తున్నారు.

ఏర్పాట్లను పూర్తిచేశాం..



కోదండ రామాలయంలో స్వామివారికి రుద్రాభి, పంచామృత అభిషేకాలు నిర్వహిస్తాం. కార్తీకమాసంలో ప్రతి సోమవారం పవిత్రమైందిగా భావిస్తూ.. వందలాది మంది భక్తులు ఆలయానికి వచ్చి ముక్కంటిని దర్శించుకుంటారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా అన్ని రకాల సౌకర్యాలు ఏర్పాటు చేశాం. – కంది అగిరెడ్డి, ఆలయ చైర్మన్

కార్తీక సోమవారం శివయ్యకు ప్రీతికరం..



కార్తీకమాసంలో వచ్చే సోమవారాలు ముక్కంటికి ప్రీతికరమైనవి. ఈ సోమవారాల్లో శివునికి చేసే అర్చనలు, అభిషేకాలు భక్తులకు అన్ని విధాలా శుభాలను కలిగిస్తాయి. ఈ మాసంలో ఉసిరిచెట్టును పూజించి ఆ చెట్టు చుట్టూ ప్రదక్షిణలు చేస్తే అనారోగ్యం దరిచేరకుండా ఆరోగ్యం సిద్ధిస్తుంది.
– లక్ష్మణ్ ప్రసాద్‌శర్మ, బ్రాహ్మణ సేవా సమితి అధ్యక్షుడు

నేడు విద్యుత్ వినియోగదారుల దినోత్సవం

మేడిపల్లి: విద్యుత్ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని నేడు ఉదయం 9.30 నుంచి ఘట్‌కేసర్ సబ్ డివిజన్ విద్యుత్ కార్యాలయంలో జరిగే విద్యుత్ వినియోగదారుల దినోత్సవాన్ని వినియోగదారులందరూ.. అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని విద్యుత్ ఘట్‌కేసర్ ఏడీఈ విజయకుమార్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

అల్వాల్: విద్యుత్ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా ఆదివారం లోతుకుంటలోని ఏడీఈ కార్యాలయం, కార్ఖానా సబ్‌స్టేషన్ పరిధిలో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సికింద్రాబాద్, కంటోన్మెంట్ డివిజనల్ ఇంజినీర్ సుబ్బారెడ్డి ప్రకటించారు. విద్యుత్ వినియోగదారులు సంబంధిత ఫిర్యాదులు సత్వరమే పరిష్కరిస్తామన్నారు.

సీతాఫలాలతో అలంకారం



మల్కాజిగిరి: ఆనంద్‌బాగ్ లక్ష్మీవేంకటేశ్వర దేవస్థానంలో మూలవిరాట్‌ను సీతాఫలాలతో అలంకరించారు. తొలిసారి ఈ ఫలాలతో అలంకరణ చేసి ప్రత్యేక పూజలు చేశామని ప్రధాన అర్చకులు ముదుంబై వేంకటరమణాచార్యులు తెలిపారు.

బాధ్యతల స్వీకరణ



డీజీఎంను సత్కరిస్తున్న సురేందర్‌రెడ్డి

అల్వాల్: జలమండలి డివిజన్ జనరల్ మేనేజర్‌గా సునీల్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా శనివారం తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పటోళ్ల సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో సత్కరించారు. అల్వాల్ వాటర్‌వర్క్స్ జీఎం భీమ్‌రావు, విశ్వనాథం, సత్యవర్ధన్, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

సత్కారం



ఏఈ వినీత్‌రావుతో కార్పొరేటర్ గీతాప్రవీణ్

ఉప్పల్: చిలుకానగర్ డివిజన్ ఏఈగా బాధ్యతలు చేపట్టిన వినీత్‌రావును శనివారం చిలుకానగర్ కార్పొరేటర్ బన్నాల గీతాప్రవీణ్ ముదిరాజ్‌లు ఘనంగా స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. డివిజన్‌లో ఉన్న పెండింగ్ పనులపై కార్పొరేటర్ వివరించారు. డివిజన్ అభివృద్ధికి సహకరించాలని కోరారు. బన్నాల ప్రవీణ్, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

చర్లపల్లి డివిజన్ అభివృద్ధికి తోడ్పాటునందిస్తా..

ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డితో సీసీఎస్ ప్రతినిధులు

కుషాయిగూడ: చర్లపల్లి డివిజన్ అభివృద్ధికి తన తోడ్పాటును అందిస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం సీసీఎస్ ప్రతినిధులు ఎంపల్లి పద్మారెడ్డి, నేమూరి మహేష్‌గౌడ్, సారా అనిల్‌ముదిరాజ్, గంప కృష్ణ ఎమ్మెల్యేను కలిసి డివిజన్ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. డివిజన్ పరిధిలోని శివసాయినగర్, వాసవి శివనగర్ కాలనీల్లో బాక్స్ డ్రైనేజీ నిర్మాణం, చర్లపల్లి శ్మశానవాటిక అభివృద్ధి, విస్టా హోమ్స్‌లో లక్షల్లో వచ్చిన తాగునీటి బిల్లుల అంశాలను ఎమ్మెల్యేకు వివరించారు. సానుకూలంగా స్పందించి ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. దశలవారీగా డివిజన్‌లో వసతులు కల్పించి డివిజన్‌ను ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు సమాచారం.

చికిత్స పొందుతున్న బాలికలు..

ఒకరి పరిస్థితి విషమం, కోలుకుంటున్న మరొకరు



ఘటనా స్థలంలో కార్పొరేటర్ శ్రీదేవి, పోలీసులు

కుషాయిగూడ: దీపావళి టపాసులు కాలుస్తూ ప్రమాదవశాత్తు గాయాలపాలైన బాలికలు వేర్వేరు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. కాగా ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జస్విత కోలుకుంటుండగా.. గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహేశ్వరి పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు సమాచారం. శుక్రవారం రాత్రి చర్లపల్లి, వెంకట్‌రెడ్డినగర్‌లో టపాసులు కాలుస్తుండగా సమీపంలోని కారుకు మంటలంటుకున్న ఘటనలో జస్విత, మహేశ్వరీలకు కాలినగాయాలైన విషయం తెలిసిందే. కాగా ప్రభుత్వం కల్పించుకుని గాయాలపాలైన బాలికలకు కార్పొరేట్ వైద్యం అందించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. విషయం తెలిసిన కార్పొరేటర్ బొంతు శ్రీదేవి ఘటన స్థలాన్ని సందర్శించారు. కాలిన గాయాలైన చిన్నారులను పరామర్శించి తల్లిదండ్రులకు ధైర్యం చెప్పారు. మెరుగైన వైద్యం అందేలా చూస్తానన్నారు.

విద్యార్థినికి సర్టిఫికెట్ల అందజేత



అంజలికి సర్టిఫికెట్లు అందజేసిన హైకోర్టు న్యాయవాది సుంకర నరేష్

కుషాయిగూడ: చదువు పూర్తయిన సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్న కళాశాల యజమాన్యంపై ప్రముఖ న్యాయవాది సుంకర నరేష్ న్యాయస్థానంలో పోరాడి విద్యార్థినికి సర్టిఫికెట్లు అందజేశారు. రాంపల్లికి చెందిన తన్నేరు అంజలి 2022–24లో తార్నాకలోని ఓ కళాశాలలో ఇంటర్ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ కోర్సు పూర్తి చేసింది. ప్రభుత్వం నుంచి రావాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ రాకపోవడంతో కళాశాల యజమాన్యం సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేసింది. దీంతో సదరు విద్యార్థిని హైకోర్టు న్యాయవాదిని సంప్రదించగా ఆయన ఫిల్ వేసి సర్టిఫికెట్లు వచ్చేలా చొరవ తీసుకున్నారు. కోర్టు ద్వారా అందుకున్న సర్టిఫికెట్లు విద్యార్థినికి అందజేశారు. తనను సంప్రదిస్తే ఉచిత న్యాయసాయం అందజేసి తోడ్పాటునందిస్తానని న్యాయవాది స్పష్టం చేశారు.

విజ్ఞానోత్సవ్‌లో పాల్గొనేందుకు అవకాశం



సర్టిఫికెట్లను అందజేస్తున్న కార్పొరేటర్ ప్రభుదాస్

కుషాయిగూడ: యునైటెట్ వే ఆఫ్ హైదరాబాద్, ఆకృతి ప్రాజెక్టు ఆధ్వర్యంలో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో నిర్వహించతలపెట్టిన విజ్ఞానోత్సవ్‌లో మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్, తిరుమలనగర్ ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థులకు పాల్గొనే అవకాశం లభించింది. ఈ మేరకు శనివారం కార్పొరేటర్ ప్రభుదాస్ హెచ్‌ఎం శ్రీనివాస్‌తో కలిసి విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా క్విజ్, డిబెట్, ఉపన్యాసం, వ్యాసరచన విభాగాల్లో ప్రతిభ కనబరిచి పాఠశాలకు, తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

కార్పొరేటర్ పర్యటన



న్యూ అంబేద్కర్‌నగర్ పర్యటనలో స్థానికులతో కార్పొరేటర్ శాంతిసాయిజెన్‌శేఖర్

మల్లాపూర్: నాచారం డివిజన్ పరిధిలోని న్యూ అంబేద్కర్‌నగర్‌లో శనివారం నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్ పర్యటించారు. పలు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ.. తొందర్లోనే రోడ్డు పనులు ప్రారంభమవుతాయన్నారు. కాలనీలో నూతనంగా డ్రైనేజీ, తాగునీటి పైపులైన్లతో పాటు సీసీరోడ్లు వేశామన్నారు. పెండింగ్‌లో ఉన్న పనులను కూడా త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. బీఆర్ఎస్ నేతలు కట్ట బుచ్చన్నగౌడ్, విఠల్‌యాదవ్, రవి, అశోక్, షర్ఫుద్దీన్, వర్క్ ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలకు సత్వర పరిష్కారం



మల్లాపూర్: తమ దృష్టికి వచ్చిన విద్యుత్ సమస్యలను సత్వరమే పరిష్కరిస్తానని మల్లాపూర్ విద్యుత్ ఏఈ నాగరాజు తెలిపారు. శనివారం మల్లాపూర్ ఎస్వీనగర్ ఫేజ్–2 అధ్యక్షుడు సీతాల వీరాస్వామి ఏఈని నాగరాజును మర్యాదపూర్వకంగా కలిసి పలు విషయాలపై చర్చించారు. ఆయనతో పాటు లక్ష్మారెడ్డి ఉన్నారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. శ్రీవల్లి శిష్యబృందంచే నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన అలరించింది. కూచిపూడి నృత్యంలో శ్రీ విఘ్నరాజం భజే, మూషికవాహన, మహేశ్వరి మహాకాళి, కృష్ణ శబ్దం, రాజశ్రీ తిల్లాన, శివాష్టకం తదితర అంశాలను ప్రదర్శించారు. భరత నాట్య ప్రదర్శనలో పుష్పాంజలి, అలరిపు, జతిస్వరం, రామదాసు కీర్తన, రామభజన, మూషిక వాహన అంశాలను లౌక్య తనుశ్రీ, అధ్యవృందా, రితిక, రుహిక, కీర్తి, శ్రీకృతి, మోక్ష తదితరులు ప్రదర్శించి మెప్పించారు.

వృద్ధాశ్రమానికి నిత్యావసరాల అందజేత



వృద్ధులకు నిత్యావసరాలను అందజేస్తున్న విద్యార్థులు

మల్లాపూర్: దీపావళి పండుగను పురస్కరించుకుని నాచారం అకడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు క్యాప్‌బౌల్ (చిన్నపిల్లల) అనాథాశ్రమం, శ్రీ అక్షర వృద్ధాశ్రమానికి బియ్యం, పప్పులు, నూనె తదితర వంటసామగ్రిని అందజేశారు. పాఠశాల డైరెక్టర్ చిలక శివకుమార్ మాట్లాడుతూ... విద్యార్థులు సేవాగుణాన్ని అలవర్చుకుని వృద్ధులు, అనాథలకు తమవంతు సాయం అందించాలన్నారు. పాఠశాల కరస్పాండెంట్ కల్పన ప్రధానోపాధ్యాయురాలు నిషాత్‌అంజుమ్, హబ్సిగూడ ఇన్‌చార్జి సంధ్య తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్ల ఏర్పాటుకు చొరవ తీసుకోవాలి

మల్కాజిగిరి: ఘట్‌కేసర్ నుంచి లింగంపల్లి వరకు రైళ్లను ప్రవేశపెట్టారని కొన్ని ప్రాంతాల్లో కొత్త రైల్వేస్టేషన్లను నిర్మించాలని డీఆర్‌యూసీసీ సభ్యుడు నూర్ అన్నారు. ఆల్వాల్ లయోలా కళాశాల, ఆనంద్‌బాగ్ వద్ద స్టేషన్ల నిర్మాణానికి తగిన ప్రణాళికలను ప్రజాప్రతినిధులు, అధికారులు పరిశీలించారన్నారు. లయోలా వద్ద సాధ్యమవుతుందని, మౌలాలి రైల్వేగేట్(ఎస్పీనగర్) వద్ద స్టేషన్ నిర్మాణానికి అనువైన స్థలం ఉందన్నారు. గతంలో మీటర్‌గేజ్ ఉన్నప్పుడు ఈ మార్గంలో రైళ్లు నడిపారని గేజ్ మార్పిడి తర్వాత స్టేషన్ నిర్మాణం చేస్తామని అప్పుడు అధికారులు చెప్పారన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు హైదరాబాద్, సికింద్రాబాద్ డివిజన్ అధికారులతో కలిసి చర్చించి స్టేషన్ నిర్మాణం జరిగేలా చూడాలని కోరారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న నాచారం ఇన్‌స్పెక్టర్ రుద్వీర్‌కుమార్

మల్లాపూర్: గంజాయి, మద్యానికి ప్రతి ఒక్కరూ దూరంగా ఉండి వాటి నివారణకు కృషి చేయాలని నాచారం ఇన్‌స్పెక్టర్ రుద్వీర్‌కుమార్ అన్నారు. శనివారం తెలంగాణ నార్కొటిక్స్ బ్యూరో ఇన్‌స్పెక్టర్లు రాంప్రసాద్, ప్రవీణ్ ఆధ్వర్యంలో నాచారం పారిశ్రామికవాడలోని ఎల్మోటి ఆల్టర్నేటర్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఉద్యోగులకు రోడ్డుభద్రత, సైబర్ సెక్యూరిటీ సమస్యలు, యాంటీ నార్కోటిక్స్‌పై అవగాహన కల్పించారు. ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ.. సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, ఆరోగ్యానికి హానిచేసే గంజాయి, మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. సెల్‌ఫోన్‌లో వచ్చే మేసేజీలు, లింక్‌లు అనవసరంగా ఓపెన్ చేయొద్దని సూచించారు. సైబర్ నేరగాళ్ల కారణంగా మోసపోతే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు.